# ధాన్యం కొనండి మహాప్రభో..!


తడిసిన బస్తాలను ఆరబెడుతున్న రైతు కిష్టయ్య


తడిసిన బస్తాలను ఆరబెడుతున్న రైతు కిష్టయ్య

నర్సాపూర్, మే 26: మండలంలోని ఖాజీపేట్ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని కొనడంలేదు. కొన్నా ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఖాజీపేట్ గ్రామానికి చెందిన రైతు కిష్టయ్య కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చి 20 రోజులుపైనే అయినా ధాన్యం కొనడం లేదు. దీంతో ధాన్యాన్ని ఆరబోసి కేంద్రం వద్దనే పడిగాపులు కాస్తున్నాడు. వర్షానికి ధాన్యం బస్తాలు తడిసి పోయాయి. బస్తాలు ఆరబెట్టి ధాన్యాన్ని నింపాలని సిబ్బంది ఇబ్బందులకు చేస్తున్నారని వ్యక్తం చేశాడు. పైగా బస్తాలు ఇవ్వడం లేదని వర్షానికి ఇబ్బందులు పడుతున్నామని వెల్లడించాడు. వర్షానికి ధాన్యం తడిసి మొలకెత్తిందన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం తూకం వేసి రైస్‌మిల్‌కి తరలించాలని రైతులు కోరారు.

## కొనుగోలు కేంద్రాల్లోని సమస్యలు పరిష్కరించాలి

- సన్నాలతోపాటు దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి
- సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం

మెదక్ మున్సిపాలిటీ, మే 26: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం జిల్లా నాయకత్వ రాజకీయ శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులకు విచ్చేసిన ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో వరి కోతలు ముగించినా ధాన్యాపు కుప్పలు కొనుగోలు కేంద్రాల వద్దనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలన్నారు. సన్నాలకు మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామంటున్న ప్రభుత్వం దొడ్డు వడ్లకూ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. జిల్లా కార్యవర్గసభ్యులు నర్సమ్మ, నాయకులు మల్లేశం, బస్వారాజ్, సంతోష్, భాగయ్య నర్సింలు, పుష్ప, షౌకత్‌అలీ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే


రాజమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, మే 26: బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ మెదక్ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. మండలంలోని రుద్రారం మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తల్లి రాజమ్మ ప్రథమ వర్ధంతిలో పాల్గొన్నారు. కొర్విపల్లి మాజీ ఉపసర్పంచ్ సక్రునాయక్ మృతి చెందగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్‌లు యాదగిరి యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఏదులాపూర్ దర్గాలో ప్రత్యేక పూజలు


ఏదుల్లాపూర్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్న నాయకులు

శివ్వంపేట, మే 26: మండలంలోని ఏదుల్లాపూర్ జమానుల్ల హుస్సేన్ దర్గాలో మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి హనుమంతరావు ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, కేఎచ్ఆర్ ట్రస్ట్ అధ్యక్షుడు కల్లూరి హనుమంతారావు, ఎదుల్లాపూర్ సర్పంచ్ కల్లూరి కీర్తన హనుమంతరావు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, సునందారెడ్డి, కల్లూరి పాండురంగం, యాదాగౌడ్, మర్రి మహేందర్‌రెడ్డి, యాదిరెడ్డి పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీరు వృథా


రోడ్డు పై వృథాగా పారుతున్న మంచినీరు

కొల్చారం, మే 26: కొల్చారం మీదుగా వరిగుంతం గ్రామానికి పోయే మిషన్ భగీరథ పైపులైన్ ఓవర్ లోడ్ కారణంగా శనివారం మధ్యాహ్నం జాయింట్ ఊడిపోయి లీకేజీ ఏర్పడింది. రెండు గంటల పాటు తాగునీరు రోడ్లపై వృథాగా పారింది. అటు వరిగుంతం గ్రామానికి మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిషన్ భగీరథ లైన్ సూపర్‌వైజర్ అనిల్, హెల్పర్లు గోపి, ప్రవీణ్ ఘటనా స్థలానికి చేరుకుని వాల్ బంద్ చేసి నీటి వృథాను అరికట్టారు.

## మున్సిపల్ భవన నిర్మాణం పరిశీలన

నర్సాపూర్, మే 26: నర్సాపూర్‌లో నిర్మిస్తున్న మున్సిపల్ భవన నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. అన్ని హంగులతో భవనాన్ని నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. నాణ్యతా లోపం లేకుండా చూసుకోవాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయనతో కౌన్సిలర్లు పంబాల భిక్షపతి, సురేశ్, నాయకులు ఆంజనేయులుగౌడ్, కాంట్రాక్టర్ నవీన్‌రావు తదితరులు ఉన్నారు.


మున్సిపల్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

## ఉత్తమ రక్తదాతల పేర్లు సేకరణ

రామాయంపేట, మే 26: జిల్లావ్యాప్తంగా ఏడాదిగా రక్తదానం చేసిన దాతల పేర్లు సేకరిస్తున్నామని జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 14న అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఈ సేకరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వారికి అవార్డులు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈనెల 31వ తేదీ వరకు 40 సార్లకంటే ఎక్కువ రక్తదానం చేసిన వారికి హైదరాబాద్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రక్తదానం చేసిన వారు 9440003964 నెంబర్‌లో సంప్రదించాలని, తమ దరఖాస్తును అందజేయాలని సూచించారు.

## మల్లన్న ఆలయంలో ప్రత్యేక పూజలు


కొలువుదీరిన మల్లన్న స్వామి

మెదక్‌రూరల్, మే 26: మంబోజిపల్లి శివారులోని కొయ్యగుట్టపై కొలువుదీరిన మల్లన్నస్వామి ఆలయంలో ఆదివారం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు. అనంతరం అన్నదానం చేశారు.

## అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే కఠిన చర్యలు

చిన్నశంకరంపేట, మే 26: అనుమతులు లేకుండా ఇసుక, మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై నారాయణ హెచ్చరించారు. ఆదివారం కొర్విపల్లి గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్నందుకు ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## బావిలో పడిన ట్రాక్టర్


బావిలో పడిన ట్రాక్టర్

చిన్నశంకరంపేట, మే 26: అదుపుతప్పి బావిలో ట్రాక్టర్ పడి, డ్రైవర్‌కు తీవ్రగాయాలైన ఘటన మండలంలోని గజగట్లపల్లిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్‌కు చెందిన వెంకటేశ్ గ్రామంలోని ఓ రైతు పొలం వద్ద కల్టివేటర్‌ను (పొలం దున్నడానికి వినియోగించేది) తీసుకుని వెళ్లడానికి తన ట్రాక్టర్ తీసుకొచ్చాడు. పొలాల నుంచి వెళ్తుండగా అదుపు తప్పి ట్రాక్టర్ బావిలో పడింది. ఇది గమనించిన రైతులు బావిలోకి దిగి డ్రైవర్‌ను కాపాడారు. వెంకటేశ్‌ను కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు.

# భక్తిశ్రద్ధలతో వేణుగోపాలస్వామి రథం ఊరేగింపు


వేణుగోపాలస్వామి పల్లకీ మోస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


దొంతిలో శ్రీవేణుగోపాలస్వామి రథం ఊరేగింపు

- పాడిపంటలు బాగా పండాలి
- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి
- పల్లకీ మోసిన సేవలో ఎమ్మెల్యే

శివ్వంపేట, మే 26: దొంతి గ్రామ ప్రజల ఇలవేల్పు వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు 11రోజులుగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం చివరిరోజు స్వామి రథాన్ని ఊరేగించారు. గ్రామంలోని పురవీధుల గుండా రథం ఊరేగింపు, స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హాజరై స్వామి వారిని దర్శించుకొని పల్లకీ మోశారు. ఏటా నిర్వహించే వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రజల సహకారంతో వైభవంగా జరుగుతున్నాయన్నారు. స్వామి ఆశీస్సులతో పాడిపంటలు బాగా పండాలని కోరారు. డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, మహిళా నాయకురాలు సుహాసినిరెడ్డి పల్లకీ మోశారు. కార్యక్రమంలో ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణాగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, మాజీ సర్పంచ్ ఫణి శశాంక్ శర్మ, కోఆప్షన్ సభ్యుడు లాయక్, యాదాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## బాధితులకు ఆర్థిక సాయం అందజేత


నర్సాపూర్ ప్రభుత్వ ఏరియా దవాఖానలో బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్/కౌడిపల్లి, మే 26: నర్సాపూర్ ఏరియా ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పరామర్శించి, వారికి ఆర్థిక సాయం అందజేశారు. కౌడిపల్లి మండలం లింగంపల్లి తండాకు చెందిన ముత్యాలు ఓ విందుకు హాజరై, ఫుడ్ పాయిజన్ కావడంతో మృతి చెందింది. ఆమె కోడలు, కొడుకులు కూడా అస్వస్థతకు గురై, చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ప్రభుత్వ ఏరియా దవాఖానకు వచ్చి బాధితులను పరామర్శించి. ఆర్థిక సాయం అందజేశారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌడిపల్లి జడ్పీటీసీ కవిత అమర్‌సింగ్, వైస్ చైర్మన్ నయీముద్దీన్, బీఆర్‌ఎస్ నాయకులు సత్యంగౌడ్, షేక్ హుస్సేన్, తౌంట వెంకట్, సూరారం నర్సింహులు, ఎల్లమయ్య, రింగుల ప్రసాద్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ చర్చిలో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు


దైవ సందేశం వినిపిస్తున్న చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య, ప్రార్థనల్లో భక్తులు

మెదక్ మున్సిపాలిటీ, మే 26: మెదక్ చర్చికి సుదూర ప్రాంతాల నుంచి వేలాది మంది పర్యాటకులు, భక్తులు రావడంతో ఆదివారం కిటకిటలాడింది. చర్చి ప్రాంగణం ఏసయ్య నామస్మరణతో హోరెత్తింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గంట గంటకు జరిగిన ప్రార్థనల్లో భక్తులు పాల్గొని ఏసయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులనుద్దేశించి చర్చి ప్రెసిబేటరీ ఇన్‌చార్జి రెవరెండ్ శాంతయ్య దైవ సందేశం వినిపించారు. అనంతరం పాస్టర్లు భక్తులను ఆశీర్వదించారు. ప్రార్థనల్లో చర్చి కమిటీ సభ్యులు గంట సంపత్, సువణ్ డగ్లస్, సంశాన్ సందీప్, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడి హేయమైన చర్య


నిజాంపేట: సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకుడు దయాకర్

నిజాంపేట, మే 26: బీఆర్‌ఎస్ రామాయంపేట పట్టణ అధ్యక్షుడు, 4వ వార్డు కౌన్సిలర్ గజవాడ నాగరాజుపై కాంగ్రెస్ కార్యకర్త గణేశ్ దాడి చేయడం అమానుషమని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దయాకర్ అన్నారు. ఆదివారం వెంకటాపూర్(కె) గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దాడి చేసిన గణేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కల్వకుంట పీఏసీఎస్ డైరెక్టర్ మహేందర్, బీఆర్‌ఎస్ నాయకులు సిద్ధిరాములు, నర్సింహులు ఉన్నారు.

### చేగుంటలో..

చేగుంట, మే 26: బీఆర్‌ఎస్ నాయకులపై కాంగ్రెస్ నాయకులు గుండాల్లా వ్యవరించడం హేయమైన చర్య అని పార్టీ నార్సింగి మండల అధ్యక్షుడు మైలరాంబాబు అన్నారు. రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ గజవాడ నాగరాజుపై కాంగ్రెస్ నాయకుడు పోచమ్మల గణేశ్ పెట్రోల్ దాడిని ఖండించారు. దాడికి స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు బాధ్యత వహించి, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

## బాధిత కుటుంబానికి చెక్కు అందజేత



కౌడిపల్లి, మే 26: మండలంలోని నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన అల్మాయిపేట అంజయ్య మృతిచెందాడు. వారి కుటుంబ సభ్యులకు బీఆర్‌ఎస్ సభ్యత్వం నుంచి రూ.రెండు లక్షల బీమా చెక్కును ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి ఆదివారం అందజేశారు.

## విద్యుత్ తీగలు తగిలి గడ్డికి మంటలు


మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

చిన్నశంకరంపేట, మే 26: విద్యుత్ తీగలు తగిలి డీసీఎంలోని గడ్డికి మంటలు అంటుకున్న ఘటన మండలంలోని మడూర్‌లో ఆదివారం జరిగింది. అంబాజిపేటకు చెందిన నర్సింహులు గ్రామంలోని రైతుల వద్ద గడ్డిని కొని డీసీఎంలో తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలు గడ్డికి తగిలి మంటలు వ్యాపించాయి. గమనించిన రైతులు రామాయంపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు మంటలను అదుపులోకి తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. సుమారు లక్ష ఆస్తి నష్టం వాటిల్లింది.

## కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధంలేదు

### టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు

రామాయంపేట, మే 26: రామాయంపేటలో బీఆర్‌ఎస్ నాయకుడిపై దాడికి కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర పీసీసీ ప్రధాన కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు అన్నారు. ఆదివారం రామాయంపేటలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ కార్యకర్త పోచమ్మల గణేశ్ ఎంపీ ఎలక్షన్ల ముందే బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరారన్నారు. ఇరువురికీ నాలుగేండ్లుగా భూ సమస్య ఉన్నదని, ఈ కారణంగానే దాడులకు దిగారన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ గజవాడ నాగరాజుకు తమకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, కౌన్సిలర్ గంగాధర్, యాదగిరి, విప్లవ్‌రావు, అశోక్, కిరణ్ తదితరులు ఉన్నారు.

## మహిళా సంఘాలకు ప్రభుత్వం చేయూత

### జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్‌రావు


చేగుంట మండలం వడియారంలో కుట్టుమిషన్ సంటర్‌ను ప్రారంభించిన జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్‌రావు

చేగుంట, మే 26: మహిళా సంఘాలకు ప్రభుత్వం చేయూతనిస్తున్నదని జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆదివారం మండలంలోని వడియారంలో ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు కుట్టుమిషన్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల మహిళల స్వయం ఉపాధికి జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అనేక రకాల పనులు కల్పిస్తుందన్నారు. వడియారంలో ఏర్పాటు చేసిన కుట్టుమిషన్ కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల యూనిఫాంలను తయారు చేస్తారన్నారు. గతంలో చేగుంట ఐకేపీ ద్వారా తయారు చేసిన వివిధ రకాల చట్నీలు, మిక్చర్, మురుకులాంటి అనేక రకాల తినుబండారాలు తయారుచేశారన్నారు. కార్యక్రమంలో చేగుంట ఏపీఎం లక్ష్మీనర్సమ్మ, సీసీ రామాస్వామి, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో కరాటే పోటీలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న నాయకులు

నర్సాపూర్, మే 26: నర్సాపూర్‌లోని చిల్డ్రన్స్ పార్క్‌లో సీనియర్ కరాటే మాస్టర్ గుర్రాల అశోక్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కరాటే పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షల్లో రాయిలాపూర్, వెంకట్రావ్‌పేట్, నర్సాపూర్, రుస్తుంపేట్, కౌడిపల్లి, కొల్చారం, దౌల్తాబాద్‌కు చెందిన 60 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. ఎగ్జామినర్‌గా రెంజుకి షోటోకాన్ కరాటే క్లబ్ ఆఫ్ ఇండియా ఫౌండర్ అండ్ డైరెక్టర్ నగేశ్ వ్యవహరించారు. అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా భూపాల్ ప్రసన్న కుమారి, శ్రీశైలం వ్యవహరించారు. బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ నాయకురాలు సుహాసినిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముళ్లపందిని వేటాడిన ఇద్దరు అరెస్టు


ముళ్లపందిని వేటాడిన ఇద్దరు వ్యక్తులు

రామాయంపేట, మే 26: రామాయంపేట అడవిలో జంతువుల వేట కోసం వచ్చి ముళ్లపందిని వేటాడిన ఇద్దరిని పట్టుకున్నట్లు అటవీ శాఖ అధికారి విద్యాసాగర్, డిప్యూటీ ఎఫ్‌ఆర్‌వో కుత్బుద్దీన్ తెలిపారు. ఆదివారం రామాయంపేటలోని అటవీ శాఖ కార్యాలయం లో విలేకరుల సమావేశంలో ఇద్దరు నిందితులను ప్రవేశపెట్టి, మాట్లాడారు. రామాయంపేట అడవి పరిధిలో ఇద్దరు నిందితులు శనివారం రాత్రి జంతువులను వేటాడుతుండగా, తమ సిబ్బంది పట్టుకున్నట్లు తెలిపారు. అదే రాత్రి ఇద్దరు నిందితులను మెదక్ కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి, మెదక్ జిల్లా వెల్దుర్తి మండలానికి చెందిన ఆశాల సంతోష్‌ను అదుపులోకి తీసుకుని జడ్జి ఎదుట ప్రవేశపెట్టామన్నారు. వీరికి కోర్టు14 రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి ముళ్లపంది, మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన సిబ్బంది రాము, నవీన్, రమేశ్‌ను అటవీ శాఖ రేంజ్ అధికారి విద్యాసాగర్ అభినందించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నది

నర్సాపూర్, మే 26: ధాన్యం కొనుగోలులో కాంగ్రెస్ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తున్నదని కాంగ్రెస్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. ఆదివారం నర్సాపూర్ క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ గత సీజన్ కంటే వేగంగా ధాన్యం కొనుగోలు చేశామన్నారు. ఇక్కడ పండించిన ధాన్యాన్ని మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు పంపిస్తున్నామన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నట్లు తెలిపారు. వానకాలం సీజన్‌లోనే రైతు భరోసా అమలుచేస్తామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, టీపీసీసీ రాష్ట్ర నాయకులు కర్ణాకర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, ఎంపీపీ జ్యోతి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నాగదేవత, పోచమ్మ వార్షికోత్సవం



నర్సాపూర్, మే 26: మండలంలోని రుస్తుంపేట్‌లో హోమియోపతి వైద్యుడు దండెపు బస్వానందం ఆధ్వర్యంలో సంతాన నాగదేవత, పోచమ్మ ఆలయాల ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవంలో గ్రామ దేవతల అభిషేకాలు, అలంకరణ, శివుడికి రుద్రాభిషేకం, నవగ్రహ గణపతి, హోమం, పూర్ణాహుతి, స్వామీజీల సందేశ సభ, అన్నదానం జరిగాయి. కార్యక్రమానికి రుస్తుంపేట్ ఆశ్రమ పీఠాధిపతి రాజయోగి వెంకటస్వామి హాజరయ్యారు.